## విలేఖరులు కావలెను

పత్రికా రంగం లో సరికొత్త సంచలనం..
మా జన సముద్రం..
ప్రతి అక్షరం జనం కోసం మా నినాదం..
అనుక్షణం ప్రజా ప్రయోజనమే మరియు సంక్షేమమే లక్ష్యంగా ముందుకు సాగనున్న మా పత్రిక లో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ జిల్లాలు,మండలాల వారీగా విలేఖరులు కావలెను..సామాజిక స్పృహ,వార్తల సేకరణ పట్ల మక్కువ.. నిజాయితీ ఇవే మా విలేఖరులకు ఉండవలసిన ముఖ్య అర్హతలు..!
సంప్రదించండి.. 9494184136



RNI NO:APTEL16151

నిరంతర వార్తా ప్రవాహం

# జనసముద్రం న్యూస్

ప్రతి అక్షరం జనం కోసం

3rd ANNIVERSARY CELEBRATIONS

సంపుటి: 03 సంచిక : 47 సోమవారం, సెప్టెంబరు 16, 2024 RNI NO: APTEL16151 పేజీలు : 8 వెల: రూ.2


# మా జోలికొస్తే ఊరుకోం: సీఎం రేవంత్



- వచ్చిన వారికి ఇక మూడినట్లే... ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- కొందరు సన్నాసులు ఇంటికొస్తామన్నారు.. మనవాళ్లే అక్కడికి వెళ్లారు..
- చింతపండు అయ్యాక మనమే వచ్చి దాడి చేశామంటున్నారు..
- బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి ఉదంతాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ వ్యాఖ్యలు
- టీపీసీసీ కొత్త చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించిన మహేశ్‌కుమార్‌గౌడ్
- అనంతరం జరిగిన సభలో ప్రసంగించిన ముఖ్యమంత్రి
- పార్టీని, ప్రభుత్వాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళ్తామని వెల్లడి
- మూడు, నాలుగు నెలల తర్వాత 'స్థానిక'ఎన్నికలు అనే సంకేతాలు
- నేను పవర్ సెంటర్‌ను కాదు.: మహేశ్‌కుమార్‌గౌడ్
- ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా పనిచేస్తానని వెల్లడి

హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎవరి జోలికి వెళ్లబోరని.. అలాగని ఎవరైనా తమ జోలికి వస్తే ఊరుకోబోమని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పాడి కౌశిక్‌రెడ్డి, అరికెపూడి గాంధీల వివాదాన్ని పరోక్షంగా ప్రస్తావిస్తూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. "వాడొకడు వీడొకడు మోపైండు. కార్యకర్తలపై కేసులు పెట్టాలని చూస్తున్నారు. కొందరు సన్నాసులు మన వాళ్ల ఇంటికి వస్తామన్నారు. కానీ మనవాళ్లే వాళ్ల ఇంటికి వెళ్లారు. ఇంటికి రమ్మన్నవాడికి చింతపండు అయినంక దాడికి వచ్చారని అంటున్నాడు. మరి ఇంటికి ఎందుకు రమ్మనాలి? .. .. దానికి పిలవాల్నా" అని పేర్కొన్నారు. తమ మంచితనాన్ని చేతగానితనంగా తీసుకుని ఎవరైనా తమ జోలికి వస్తే.. వీపు చింతపండు అవుతుందని వ్యాఖ్యానించారు. పీసీసీ కొత్త అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ సౌమ్యుడేనని.. కానీ ఆయన వెనుక తాను ఉన్నానని గుర్తుపెట్టుకోవాలని హెచ్చరించారు. పార్టీ జెండాను మోస్తున్న కార్యకర్తలను కాపాడుకుంటామని.. పార్టీని, ప్రభుత్వాన్ని జోడెద్దుల్లా ముందుకు తీసుకెళతామని చెప్పారు. టీపీసీసీ కొత్త అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ ఆదివారం గాంధీభవన్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో సీఎం రేవంత్‌రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కొత్త పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్‌పై పార్టీ గురుతర బాధ్యతను పెట్టిందని రేవంత్ అన్నారు. "మా ఎన్నికలు అయిపోయాయి. ఇప్పుడు మీ ఎన్నికలు రాబోతున్నాయి. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, ఎంపీపీలు, జెడ్పీటీసీ ఎన్నికలు వస్తాయి. ఈ ఎన్నికల్లో పార్టీ జెండా మోసిన కార్యకర్తలను గెలిపించుకునే బాధ్యతలను నేను, మహేశ్‌గౌడ్ తీసుకుంటాం. మా ఎన్నికల కంటే ఎక్కువగా మీ ఎన్నికల కోసం పనిచేస్తాం. మీరు గెలిస్తేనే మేం గెలిచినట్టు, కాంగ్రెస్ పార్టీ గెలిచినట్టు. స్థానిక ఎన్నికల్లో విజయానికి పునరంకితమవుదాం"అని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మూడు, నాలుగు నెలల్లో కులగణన పూర్తవుతుందని.. ఆ తర్వాత స్థానిక ఎన్నికలు జరుగుతాయని రేవంత్ చెప్పారు. గతంలో పదేళ్లు టీడీపీ, ఆ తర్వాత పదేళ్లు కాంగ్రెస్, మళ్లీ పదేళ్లు టీఆర్ఎస్ రాష్ట్రంలో అధికారంలో ఉన్నాయని.. ఇదే పద్ధతిలో మరో పదేళ్లపాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని చెప్పారు.

### ఆ ఎన్నికలు ఫైనల్స్

2023 అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు సెమీఫైనల్స్‌లో లభించిన విజయం మాత్రమేనని సీఎం రేవంత్ అన్నారు. "2029లో ఫైనల్స్ జరగబోతున్నాయి. ఆ ఎన్నికల్లో ఢిల్లీ గద్దెపై కాంగ్రెస్ జెండా ఎగరాలి. మోదీని ఓడించి రాహుల్‌గాంధీని

(మిగతా 2వ పేజీలో)



# ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

## ప్రాజెక్టు వద్దనుకుంటే రైతుల భూములు తిరిగి ఇచ్చేయాలి

## సీఎం రేవంత్‌కు కేటీఆర్ బహిరంగ లేఖ

హైదరాబాద్: ఫార్మాసిటీ ప్రాజెక్టును ప్రభుత్వం కొనసాగిస్తుందా? లేదా? అనే అంశంపై స్పష్టత ఇవ్వాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు, సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. హైకోర్టు సైతం ఈ విషయంలో స్పష్టత కోరిందని, తక్షణమే ప్రభుత్వం విధానపరమైన నిర్ణయాన్ని వెల్లడించాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆదివారం సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. లైఫ్ సైన్సెస్, ఫార్మా రంగాల్లో హైదరాబాద్‌ను అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలిపే ఉద్దేశంతో ఫార్మా సిటీ అనే బృహత్తరమైన ప్రాజెక్టును గత కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిందని గుర్తు చేశారు. 9.7 బిలియన్ డాలర్ల పెట్టుబడులను సాధించే లక్ష్యంతో ఫార్మా సిటీ ప్రాజెక్ట్‌ను ఏర్పాటు చేయాలని భావించామన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే 5 లక్షల మందికి ప్రత్యక్ష ఉపాధి లభిస్తుందనే ఆలోచన చేశామన్నారు. భూ సేకరణను సైతం పూర్తి చేశామని తెలిపారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక ఫార్మాసిటీ ప్రాజెక్టుపై గందరగోళం నెలకొందన్నారు. ఈ ప్రాజెక్టును రద్దు చేస్తున్నట్లుగా సీఎం ప్రకటించటంతో ఫార్మా సిటీలో పెట్టుబడులు పెట్టే సంస్థలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఫార్మా సిటీ వస్తే ఉద్యోగాలొస్తాయని భావించిన యువత, బతుకులు బాగుపడతాయని భూములు ఇచ్చిన రైతుల్లో గందరగోళం

(మిగతా 2వ పేజీలో)



# రాజీనామా చేస్తా

### పదవి నుంచి తప్పుకొంటానని ఢిల్లీ సీఎం కేజ్రీ ప్రకటన

- ఇది నాకు నేను విధించుకునే అగ్నిపరీక్ష
- పార్టీని చీల్చేందుకు బీజేపీ కుట్రలు
- దేవుడు అండగా ఉండి రక్షించాడు
- రాజ్యాంగాన్ని కాపాడాలనే ఇంతకాలం రాజీనామా చేయలేదు
- నిర్దోషిగా నిరూపించుకునే వరకు ముఖ్యమంత్రి కుర్చీలో కూర్చోను
- నవంబరులోనే ఎన్నికలు నిర్వహించాలి
- సీఎం పదవిని ప్రజాకోర్టు నిర్ణయిస్తుంది
- కార్యకర్తల భేటీలో కేజ్రీవాల్ వ్యాఖ్యలు
- కొత్త సీఎంగా ఆతిషికి అవకాశాలు!
- హరియాణాపై దృష్టి సారించనున్న కేజ్రీ
- ఆయన రాజీనామా ఓ గిమ్మిక్కు: కాంగ్రెస్
- అది పబ్లిసిటీ కోసం నాటకం: బీజేపీ

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: ఢిల్లీ ముఖ్యమంత్రి, ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) చీఫ్ అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయాన్ని ప్రకటించారు. రెండ్రోజుల్లో సీఎం పదవికి రాజీనామా చేస్తానని

(మిగతా 2వ పేజీలో)

## వరద బాధితులకు

# ఆపన్నహస్తం

- జీవీకే, దివీస్ సంస్థలు
- రూ.5 కోట్ల చొప్పున విరాళం
- సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు చెక్కుల అందజేత



# జమిలి ఈ టర్మ్‌లోనే!



- ఒక దేశం-ఒకే ఎన్నికకు అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం
- ఎన్డీయే పక్షాల మధ్య సమన్వయం భేష్
- ఈ బంధం ఐదేళ్లూ కొనసాగుతుంది!
- త్వరలోనే జనాభా లెక్కల సేకరణ
- కులగణనపై ఇంకా నిర్ణయించలేదు
- కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మానుకోండి: వైఎస్ జగన్

- సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ హెచ్చరిక
- ఆ మాటున స్కామ్‌లు చేయడం విరమించుకోకపోతే ప్రజాగ్రహం తప్పదు



అమరావతి: రాష్ట్రానికి ఎంబీబీఎస్ సీట్లు వస్తుంటే సంతోషించాల్సింది పోయి.. అవసరం లేదంటూ చంద్రబాబు ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయడం చాలా దారుణమని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజారోగ్య రంగాన్ని బలోపేతం చేసే బృహత్తర యజ్ఞానికి రాష్ట్ర ప్రభుత్వమే స్వయంగా తన చేతులతో తానే భంగం కలిగించడం అత్యంత హేయం, దుర్మార్గమని మండిపడ్డారు. పక్క రాష్ట్రాలు కొత్త మెడికల్ కాలేజీలు, ఎంబీబీఎస్ సీట్ల కోసం ప్రదక్షిణలు చేస్తున్న పరిస్థితుల్లో మన రాష్ట్రానికి వచ్చిన సీట్లను తిప్పి పంపడం ఏ తరహా పరిపాలనకు నిదర్శనం అని చంద్రబాబును నిలదీశారు. 'ఇకనైనా కళ్లు తెరవండి.. వెంటనే ఎన్ఎంసీకి

(మిగతా 2వ పేజీలో)

# ఫార్మాసిటీ ఉంటుందా? లేదా?

నెలకొందన్నారు. ఫార్మా సిటీ కోసం సేకరించిన భూమిని ఇతర ప్రాజెక్టుల కోసం వినియోగిస్తామంటే కుదరదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తు చేశారు. మొండి పట్టుదలకు పోయి రాజకీయాల కోసం తెలంగాణ ప్రయోజనాలను దెబ్బ తీయవద్దని కోరారు. ప్రాజెక్టును రద్దు చేయాలని భావిస్తే రైతుల భూములను తిరిగి అప్పగించాలని డిమాండ్ చేశారు. భూములను ఇతర అవసరాలకు వాడతామంటే రైతులతో పాటు బీఆర్ఎస్ కూడా ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని హెచ్చరించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు: 'అసలు పార్టీలో చేర్చుకోవడం ఎందుకు? ఆ తర్వాత పదవులు పోతాయన్న భయంతో ఈ నాటకాలెందుకు?'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. తారకరామారావు, మంత్రి శ్రీధర్‌బాబును ప్రశ్నించారు. మంత్రి వ్యాఖ్యలపై స్పందిస్తూ, ఎక్స్ వేదికగా ఆదివారం ఆయన ట్వీట్ చేశారు. 'సిగ్గులేకుండా ఇంత నీతిమాలిన రాజకీయం ఎందుకు? మీరు ప్రలోభపెట్టి చేర్చుకున్న వాళ్లను మా వాళ్లు అని చెప్పుకోలేని మీ బాధను చూస్తే జాలి కలుగుతోంది. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు'అని ఆయన ట్వీట్‌లో పేర్కొన్నారు.

# వరద బాధితులకు ఆపన్నహస్తం

**జీవీకే, దివీస్ సంస్థలు రూ.5 కోట్ల చొప్పున విరాళం**

**సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌లకు చెక్కుల అందజేత**

అమరావతి, సెప్టెంబరు 15 : రా ష్ట్రంలో వరద బాధితులను ఆదుకునేందుకు పెద్ద మనసుతో అనేక మంది దాతలు ముందుకొస్తున్నారు. ఆదివారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి, సీఎం సహాయ నిధికి పలువురు దాతలు విరాళాలను చెక్కుల రూపంలో అందజేశారు. విరాళాలు అందజేసిన దాతలకు సీఎం చంద్రబాబు అభినందనలు తెలిపారు. జీవీకే ఫౌండేషన్ చైర్మన్ జీవీకే రెడ్డి, జీవీ సంజయ్‌రెడ్డి రూ.5కోట్ల చెక్కు అందజేశారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ చైర్మన్ అరుణ్ అలగప్ప, ఎండీ శంకర్‌సుబ్రహ్మణ్యం రూ.కోటీ 50లక్షలు, కాంటినెంటల్ కాఫీ తరఫున చల్లా శ్రీకాంత్ రూ.కోటీ 11లక్షలు, చల్లా రాజేంద్రప్రసాద్ ఫ్యామిలీ ఫౌండేషన్ తరఫున చల్లా అజిత రూ.కోటి, ట్రైజియో టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఎండీ వేములపల్లి అశోక్, వేములపల్లి రోహిత్ రూ.కోటి, లారస్ ల్యాబ్స్ ఫౌండర్, సీఈవో డాక్టర్ సత్యనారాయణ చావా, నాగరాణి చావా రూ.కోటి అందించారు. అదేవిధంగా నెల్లూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త గంటా రమణయ్య నాయుడు, ఆయన కుమారుడు రమేశ్, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు, ఉదయగిరి మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు కుమారులు ధనుష్, కార్తీక్ సంయుక్తంగా రూ.కోటి రూపాయల విరాళాన్ని సీఎం చంద్రబాబుకు అందజేశారు. అలాగే, చలసాని చాముండేశ్వరి, శ్రీమన్ రూ.25లక్షలు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ రూ.2లక్షలు, నరసింహారావు రూ.2లక్షలు సీఎంకు చెక్కు రూపంలో అందించారు. ఈ సందర్భంగా చంద్రబాబు వారితో మాట్లాడుతూ ఇలాగే ప్రజాసేవలో పాల్గొంటూ ముందుకు సాగాలని అభినందించారు.

**దివీస్ సంస్థ మొత్తం 9.8కోట్ల భూరి విరాళం!**

దివీస్ సంస్థ సీఈవో దివి కిరణ్ ఆదివారం హైదరాబాద్‌లో మంత్రి నారా లోకేశ్‌ను కలిసి రూ.5కోట్ల చెక్కును అందజేశారు. ఈ నెల 1 నుంచి 8 వరకు వరద బాధితులకు ఆహారాన్ని అందించేందుకు ఇంతకుముందే అక్షయపాత్ర ఫౌండేషన్‌కు దివీస్ సంస్థ రూ.4.8కోట్లను అందజేసింది. మొత్తం రూ.9.8కోట్లు విరాళమిచ్చిన దివీస్‌ను లోకేశ్ అభినందించారు.



# జమిలి ఈ టర్మ్‌లోనే!

**ఒక దేశం-ఒకే ఎన్నికకు**

**అన్ని పార్టీల మద్దతుపై మోదీ సర్కారు ఆశాభావం**

న్యూఢిల్లీ, సెప్టెంబరు 15: లోక్‌సభలో బీజేపీకి సొంతగా సంపూర్ణ మెజారిటీ లేనప్పటికీ జమిలి ఎన్నికలు నిర్వహించాలని గట్టి పట్టుదలగా ఉంది. 'ఒక దేశం-ఒకే ఎన్నిక'కు పార్టీలకతీతంగా మద్దతు లభిస్తుందని మోదీ సర్కారు ఆశాభావంతో ఉంది. మోదీ సారథ్యంలోని ప్రభుత్వం మూడోసారి అధికార పగ్గాలు చేపట్టి వంద రోజులు పూర్తవుతోందని.. పాలక కూటమిలో సమన్వయం అద్భుతంగా ఉందని.. ఈ బంధం ఐదేళ్లూ పటిష్ఠంగా కొనసాగుతుందని గట్టిగా భావిస్తోందని పేరు చెప్పడానికి ఇష్టపడని ప్రభుత్వ వర్గాలు ఆదివారం తెలిపాయి. 'జమిలి ఎన్నికలు ఈ టర్మ్‌లోనే అమలవుతాయి. వాస్తవ రూపం దాల్చబోతోంది' అని వెల్లడించాయి. లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ విడుదల చేసిన మేనిఫెస్టోలో జమిలి ఎన్నికల హామీ కూడా ఉంది. లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు సమాంతరంగా ఒకేసారి ఎన్నికలు జరపాలని.. ఇవి పూర్తయిన వంద రోజుల వ్యవధిలోనే స్థానిక సంస్థల ఎన్నికలు జరపాలంటూ.. మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ సారథ్యంలోని అత్యున్నత స్థాయి కమిటీ ఇప్పటికే సిఫారసు చేసింది. జాతీయ లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, అసెంబ్లీలు, పంచాయతీలు/మున్సిపాలిటీలకు ఒకే దఫా ఎన్నికలు జరపాలని.. ఒకవేళ త్రిశంకు సభ ఏర్పడితే లేదా అవిశ్వాస తీర్మానంలో ప్రభుత్వాలు ఓడిపోతే ఐక్య ప్రభుత్వాలు ఏర్పాటుచేయాలన్న నిబంధనతో విడిగా ఓ నివేదిక సమర్పించే అవకాశం ఉంది. తన సిఫారసుల అమలుకు ప్రత్యేక గ్రూపు ఏర్పాటు చేయాలని కోవింద్ కమిటీ ప్రతిపాదించింది. అలాగే జమిలి ఎన్నికలకు 18 రాజ్యాంగ సవరణలను సూచించింది. వీటిలో ఎక్కువ సవరణలకు రాష్ట్రాల అసెంబ్లీల ఆమోదం అక్కర్లేదని వివరించింది.

**'కులం' కాలమ్ ఉంటుందా?**

జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ త్వరలోనే ప్రారంభం కానుంది. అయితే కులాలవారీగా జనగణన చేపట్టడంపై కేంద్రం ఇంకా నిర్ణయం తీసుకోలేదు. సదరు డాక్యుమెంటుపై 'కులం' కాలమ్ పెట్టాలా.. అక్కర్లేదా అన్న దానిపై నిర్ణయం తీసుకోవలసి ఉందని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి. కాంగ్రెస్, ఇతర ప్రతిపక్షాలు, కొన్ని ఎన్డీయే పార్టీలు కూడా కులగణన చేపట్టాలని గట్టిగా డిమాండ్ చేస్తున్నాయి. జనాభా లెక్కలు వెల్లడైన తర్వాత చట్టసభల నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ జరుగుతుంది. ఇది పూర్తికాగానే లోక్‌సభ, అసెంబ్లీల్లో మహిళలకు మూడో వంతు సీట్ల కేటాయింపు అమల్లోకి వస్తుంది. కాగా, ప్రభుత్వ ఎన్యుమరేటర్ల ద్వారా కాకుండా తమంత తాము జనగణన దరఖాస్తును నింపాలనుకునే పౌరులు ఎన్‌పీఆర్‌లో రిజిస్టర్ చేసుకోవచ్చు. ఇదిలా ఉండగా, రెండేళ్లలో దేశంలో నక్సలిజం పూర్తిగా కనుమరుగవుతుందని కేంద్ర వర్గాలు అంచనా వేస్తున్నాయి. మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత మొదటి 100 రోజుల కార్యాచరణ జాబితాలోనే నక్సల్స్ సమస్యపై దృష్టి పెట్టింది. ఈ నేపథ్యంలో భద్రతా బలగాల ఆపరేషన్లలో 150 మందికి పైగా మావోయిస్టులు హతమయ్యారు.

# చేతకాని సీఎం వల్లే దౌర్భాగ్యం

ప్రధానిని చేయాలి. అప్పుడే మనం ఫైనల్స్‌లో గెలిచినట్టు. తెలంగాణ నుంచి ఆ ఎన్నికల్లో 15 మందిని కాంగ్రెస్ ఎంపీలుగా గెలిపించాలి. అప్పటివరకు ఎవరూ విశ్రమించొద్దు"అని పిలుపునిచ్చారు.

**రాజీనామా చేస్తానన్న వ్యక్తి ఎక్కడ?**

తాను టీపీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించాక ఇంద్రవెల్లిలో సమరశంఖం పూరించానని సీఎం రేవంత్ గుర్తు చేసుకున్నారు. అప్పటి నుంచి వెనుదిరిగి చూడకుండా నేతలను, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి తెచ్చేందుకు పనిచేశానని చెప్పారు. అధికారంలోకి వచ్చిన రెండు రోజులకే ఆరు గ్యారంటీల అమలు ప్రారంభించామన్నారు. "దేశంలో ఎక్కడా లేని విధంగా రైతులకు ఒకేసారి రూ.18 వేల కోట్లు రుణమాఫీ చేశాం. కాంగ్రెస్ రైతు రుణమాఫీ చేస్తే రాజీనామా చేస్తానన్న సన్నాసి ఎక్కడ? కావాలంటే వివరాలు పంపిస్తా.."అని రేవంత్ వ్యాఖ్యానించారు. కేసీఆర్, కేటీఆర్‌ల ఉద్యోగాలు ఊడగొడితేనే నిరుద్యోగులకు ఉద్యోగాలు వస్తాయని తాను చెప్పానని.. చెప్పినట్టుగానే ఇప్పటికే 65 వేల ఉద్యోగాలు ఇచ్చామని పేర్కొన్నారు.

**దేశానికి ఒలింపిక్స్ బంగారు పతకం తెస్తాం!**

క్రీడలను ప్రోత్సహించేందుకు రాష్ట్రంలో స్పోర్ట్స్ యూనివర్సిటీని ఏర్పాటు చేస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. 2028 ఒలింపిక్స్‌లో దేశం తరఫున బంగారు పతకాన్ని తెచ్చే బాధ్యతను తెలంగాణ తీసుకుంటుందన్నారు. రాష్ట్ర భవిష్యత్ అవసరాలకు తగినట్టుగా ఫోర్త్ సిటీ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు.

**నేను పవర్ సెంటర్‌ను కాదు : టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్**

కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీ గుర్తింపు ఇస్తుందనేందుకు తన నియామకమే నిదర్శనమని నూతన టీపీసీసీ చీఫ్‌గా మహేశ్‌కుమార్‌గౌడ్ చెప్పారు. తాను పీసీసీ అధ్యక్షుడిని అవుతానని అనుకోలేదని.. పార్టీ బాధ్యతలు చూడాల్సి వస్తుందని అప్పుడప్పుడూ రేవంత్‌రెడ్డి అంటుంటే ఊరికే అంటున్నారని భావించేవాడినని తెలిపారు. పీసీసీ అధ్యక్షుడిగా తనకెలాంటి భేషజాలు లేవని.. తాను పవర్ సెంటర్‌ను కానని చెప్పారు.

తాను ప్రభుత్వానికి, పార్టీకి మధ్య వారధిగా ఉంటానని.. తాను పీసీసీ అధ్యక్షుడిగా, రేవంత్‌రెడ్డి సీఎంగా ఉన్నంత కాలం పార్టీ కార్యకర్తలపై గీత కూడా పడనీయమని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో పార్టీ కార్యాలయాలు నిర్మించాలన్నదే తన లక్ష్యమని, ఆ దిశలో ప్రభుత్వం కూడా సహకారం అందించాలని కోరారు. మంత్రులు వారంలో రెండు రోజులు గాంధీ భవన్‌కు రావాలని.. జిల్లాలకు వెళ్లినప్పుడు జిల్లా పార్టీ కార్యాలయాలకు వెళ్లాలని కోరారు. సీఎం రేవంత్ కూడా వీలును బట్టి నెలకు రెండు సార్లయినా గాంధీభవన్‌కు వచ్చి వెళ్లాలన్నారు. దీనివల్ల పార్టీ శ్రేణులతో మమేకం కావొచ్చన్నారు.

**సౌమ్యుడినేగానీ.. కరాటే బ్లాక్ బెల్ట్ ఉంది..**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బద్నాం చేయాలని ప్రతిపక్షాలు చూస్తున్నాయని.. సోషల్



మీడియాను సోషల్‌సెన్స్ లేకుండా ఉపయోగించుకుంటున్నాయని మహేశ్‌గౌడ్ విమర్శించారు. వాటిని ఎదుర్కోవాల్సింది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలేనని, గ్రామగ్రామానికి వెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వివరించాలని పిలుపునిచ్చారు. తనను సౌమ్యుడని సీఎం రేవంత్‌రెడ్డి అంటున్నారని.. ప్రజాస్వామ్యంలో తాను సౌమ్యుడినే అయినా కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఉందని చమత్కరించారు.

**పెళ్లి ముహూర్తం పెట్టిన అయ్యగారితోనే..**

మహేశ్‌కుమార్‌గౌడ్ తన పెళ్లికి ముహూర్తం పెట్టిన పురోహితుడితోనే పీసీసీ అధ్యక్ష బాధ్యతల స్వీకార కార్యక్రమంలో పూజలు చేయించారు. ఆయన నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లికి చెందిన పూజారి కృష్ణమాచార్యులు. ఆయన, గాంధీభవన్ పూజారి శ్రీనివాసమూర్తి ఇద్దరూ కలిసి పూజలు చేశారు. ఇక గాంధీభవన్‌తో తనకు 40 ఏళ్ల అనుబంధం ఉందని, తన అడుగుపడని మిల్లీమీటర్ స్థలం కూడా గాంధీభవన్‌లో లేదని.. ప్రతి గోడ, కిటికీ, తలుపును తాను తాకానని మహేశ్‌గౌడ్ గుర్తు చేసుకున్నారు. పీసీసీ అధ్యక్షుడిగా తన తొలి ప్రసంగంతోనే కార్యకర్తలను ఆకట్టుకున్నారు. సౌమ్యుడిని అంటూనే కరాటేలో బ్లాక్‌బెల్ట్ ఉందన్నారు. పార్టీ నేతలకు అందుబాటులో ఉండటం కోసం మంత్రులు తరచూ గాంధీభవన్‌కు, జిల్లా కార్యాలయాలకు రావాలని కోరారు.

**రేవంత్ నుంచి జెండా అందుకుని..**

పీసీసీ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకునేందుకు మహేశ్‌గౌడ్ హైదరాబాద్‌లోని నార్సింగి నుంచి భారీ ర్యాలీగా అమరవీరుల స్థూపం వద్దకు వచ్చారు. అక్కడ నివాళులు అర్పించిన అనంతరం గాంధీభవన్‌కు చేరుకుని.. సీఎం రేవంత్‌రెడ్డి నుంచి టీపీసీసీ చీఫ్ బాధ్యతలు తీసుకున్నారు. సభా ప్రాంగణంలో రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా పార్టీ జెండాను అందుకున్నారు.

# రాజీనామా చేస్తా

వెల్లడించారు. "నేను నిర్దోషిగా నిరూపించుకునేంత వరకు సీఎం పదవిలో ఉండను. వచ్చే ఎన్నికల్లో ప్రజలు ఆప్‌ను గెలిపించి, అధికారం కట్టబెట్టేవరకు సీఎం పీఠాన్ని అధిరోహించను" అని వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాత.. తదుపరి సీఎంను ప్రకటిస్తామని పేర్కొన్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో కేజ్రీవాల్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు భగవంతుడే తమ వెంట ఉండి, ముందుకు నడిపించారని, దేవుడిచ్చిన ధైర్యంతోనే శత్రువులపై పోరాడుతామని ఉద్ఘాటించారు. కాగా, ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో సుప్రీంకోర్టు శుక్రవారం కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేసిన విషయం తెలిసిందే..! ఆర్నెల్లుగా జైలులో ఉన్న ఆయన సుప్రీంకోర్టు తీర్పుతో విడుదలయ్యారు. అప్పుడు విలేకరులతో మాట్లాడుతూ దేశాన్ని బలహీనపరుస్తూ.. విభజించే ప్రయత్నాలు చేస్తున్న శక్తులపై తాను పోరాటం చేస్తానని ప్రతినబూనారు. ఆదివారం కార్యకర్తలతో భేటీ అయ్యారు. "మా నేతలు సత్యేందర్ జైన్, అమానతుల్లాఖాన్ ఇంకాజైలులోనే ఉన్నారు. వారూ త్వరలో బయటకు వస్తారని భావిస్తున్నాను" అనే ఆశాభావం వ్యక్తం చేశారు. తన రాజీనామా తర్వాత కొత్త సీఎం ఎంపికకు పార్టీ నిర్ణయం తీసుకుంటుందన్నారు. బీజేపీపై ఆయన తీవ్రవ్యాఖ్యలు చేశారు.

"ఆప్‌ను ముక్కలు చేసేందుకే బీజేపీ నన్ను జైలుకు పంపింది. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో గద్దెనెక్కాలని కుట్రలు పన్నింది. కానీ పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది" అన్నారు. బీజేపీ కుట్రలను ముందే గుర్తించి, రాజ్యాంగాన్ని రక్షించాలనే ఉద్దేశంతోనే తాను ఇంతకాలం రాజీనామా చేయలేదని పేర్కొన్నారు.

"జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడపకూడదని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. అలా సర్కారును నడపవచ్చని వెల్లడించింది. ఫిబ్రవరిలో జరగాల్సిన ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను నవంబరులో నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని డిమాండ్ చేస్తున్నా. మహారాష్ట్రతోపాటు ఢిల్లీ ఎన్నికలు జరగాలని ఆకాంక్షిస్తున్నా. ఇంటింటికీ వెళ్లి ఓట్లడుగుతాను. నేను నిర్దోషినని నమ్మితేనే ఓట్లు వేయాలని ప్రజలను కోరుతాను. సుప్రీంకోర్టు నాకు బెయిలిచ్చింది. ప్రజాకోర్టులో ప్రజలే తీర్పునిస్తారు. నేను దోషినా? నిర్దోషినా? అనేదాన్ని ప్రజలే నిర్ణయిస్తారు. నేను, మనీశ్ సిసోడియా ప్రజాకోర్టునే ఆశ్రయిస్తాం. నా నిర్దోషిత్వంపై అంతిమన్యాయనిర్ణేతలు ప్రజలే. రాజీనామా నిర్ణయం నాకు నేను విధించుకుంటున్న అగ్నిపరీక్ష" అని ఉద్వేగంగా అన్నారు. బీజేపీయేతర పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో బీజేపీ కొత్త ఆటను ప్రారంభించిందని మండిపడ్డారు. కర్ణాటకలో సిద్దరామయ్య, కేరళలో పినరయి విజయన్, పశ్చిమబెంగాల్‌లో మమతాబెనర్జీపై కేసులు నమోదు చేశారన్నారు. "బీజేపీయేతర సీఎంలందరికీ నా విన్నపం ఏమిటంటే కేసులు నమోదుచేస్తే రాజీనామాలుచేయొద్దు" అని అన్నారు.

**బ్రిటిషర్లు కూడా ఊహించి ఉండరు**

దేశాన్ని రెండొందల ఏళ్లు పాలించిన బ్రిటిషర్లు కూడా భవిష్యత్తును ఊహించి ఉండరని కేజ్రీవాల్ వ్యంగ్యంగా అన్నారు. "బ్రిటిషర్లు భవిష్యత్‌లో తమకంటే క్రూరమైన పాలకులు భారత్‌లో ఉంటారని అస్సలు అనుకుని ఉండరు. 75ఏళ్ల స్వతంత్ర భారతంలో అది సాధ్యమైంది" అని బీజేపీని ఉద్దేశించి అన్నారు. జైలులో ఎన్నో పుస్తకాలు చదివానని, భగవద్గీతను ఎన్నోసార్లు పఠించానని, భగత్‌సింగ్ పుస్తకం (భగత్‌సింగ్ కీ జైల్ డైరీ)ను చదివానని చెప్పారు. "భగత్‌సింగ్ జైలులో ఉండగా.. తన మిత్రులకు, దేశ యువతకు ఎన్నో లేఖలు రాశారు. బ్రిటిష్ పాలకులు వాటిని సంబంధిత వ్యక్తులకు అందేలా చేశారు. నేను జైలు నుంచి లెఫ్టినెంట్ గవర్నర్‌కు ఎన్నో లేఖలు రాశాను. నేను జైలులో ఉన్నందున ఢిల్లీ మంత్రి ఆతిషిని జెండావందనం చేసేందుకు అనుమతించాలని ఓ లేఖలో కోరా. స్పందన లేదు. కానీ నాకు హెచ్చరికలు వచ్చాయి. మరోమారు లేఖరాస్తే ములాఖత్‌లో కుటుంబ సభ్యులను కలిసే అవకాశం కూడా దక్కదని బెదిరించారు. నాతో ఒకసారి ములాఖత్ అయిన సందీప్ పాఠక్‌ను బ్లాక్‌లిస్టులో పెట్టారు. ఇంతటి నియంతృత్వం రాబోతుందని బ్రిటిషర్లు అప్పట్లో ఊహించి ఉండరు" అని కేజ్రీవాల్ అన్నారు.

**అది గిమ్మిక్కే: కాంగ్రెస్**

కేజ్రీవాల్ రాజీనామా నాటకం ఓ గిమ్మిక్కేనని కాంగ్రెస్ నేత సందీప్ దీక్షిత్ విమర్శించారు. "కేజ్రీవాల్ రాజీనామాకు మేము ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నాం. ఇప్పుడు గిమ్మిక్కుల్లో భాగంగా రాజీనామా ప్రకటన చేశారు. కేజ్రీవాల్ బెయిల్‌పై విడుదలయ్యాక ఆయనను సీఎంవోకు వెళ్లొద్దని, ఫైళ్లపై సంతకాలు చేయొద్దని సుప్రీంకోర్టు ఆదేశించింది. అలాంటి బెయిల్ షరతులను గతంలో ఏ సీఎం కూడా ఎదుర్కోలేదు"అని ఆయన అన్నారు.

# మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ మానుకోండి: వైఎస్ జగన్

రాసిన లేఖను వెనక్కు తీసుకోండి. ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోండి' అని హితవు పలికారు. మెడికల్ కాలేజీల్లో మిగిలిన పనులను పూర్తి చేసి, పేద పిల్లలకు వైద్య విద్యను, పేదలకు నాణ్యమైన ఉచిత వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. 'మీకు చేతనైనంత మీరు ఖర్చు చేస్తూ వెళ్లండి.. మీకు చేతకాకపోతే మళ్లీ మేం వచ్చిన తర్వాత అయినా పూర్తి చేస్తాం. అంతేకానీ ఇలా మెడికల్ కాలేజీల ప్రైవేటుపరం మాటున స్కామ్‌లు చేయడం మానుకోండి. లేదంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదని గుర్తించుకోండి' అని చంద్రబాబును హెచ్చరించారు. మెడికల్ కాలేజీల వ్యవహారంలో చంద్రబాబు ప్రభుత్వ తీరును తూర్పారపడుతూ ఆదివారం 'ఎక్స్' వేదికగా వైఎస్ జగన్ పోస్ట్ చేశారు. అందులో ఇంకా ఏమన్నారంటే..



**బాధ్యతల నుంచి తప్పించుకుంటే దాన్ని ప్రభుత్వం అంటారా?**

నాణ్యమైన విద్య, వైద్యాన్ని ప్రజలకు ఒక హక్కుగా అందించడం అన్నది ప్రభుత్వాల ప్రాథమిక బాధ్యత. తమ పిల్లలకు మంచి విద్యను అందించడానికి, మంచి వైద్యం అందుకోవడానికి ఏ కుటుంబం కూడా ఆస్తులు అమ్ముకునే పరిస్థితి రాకూడదు. ఈ బాధ్యతల నుంచి రాష్ట్ర ప్రభుత్వం ఏ రకంగా తప్పించుకుంటుంది చంద్రబాబూ? అలా తప్పించుకుంటే, దాన్ని ప్రభుత్వం అని అంటారా? దీన్ని గుర్తించే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకొచ్చాం. ప్రతి పార్లమెంటు నియోజకవర్గంలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్న లక్ష్యంతో రూ.8,480 కోట్లతో 17 మెడికల్ కాలేజీల నిర్మాణాలను ప్రారంభించాం. దీని వల్ల ప్రభుత్వానికి ఏ రకంగా నష్టం వస్తుంది? 2023%-%24 సంవత్సరాల్లో ఐదు కాలేజీల్లో తరగతులు ప్రారంభం కావడం నిజం కాదంటారా? తద్వారా 750 ఎంబీబీఎస్ సీట్లు అదనంగా రాష్ట్రానికి రాలేదంటారా? చాలా మంది పేద పిల్లలు సీట్లు సాధించి డాక్టర్ చదువులు చదవడం లేదా? నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం వెళ్తే ఈ ఏడాదిలో మరో ఐదు కాలేజీలు.. మదనపల్లె, పులివెందుల, ఆదోని, మార్కాపురం, పాడేరుల్లో మరో 750 సీట్లు అందుబాటులోకి వచ్చేవి. విద్యార్థులు డాక్టర్లయ్యే అవకాశం ఉండేది. ఇప్పుడు పాడేరు కాలేజీని 50 సీట్లకే పరిమితం చేయడం ఏంటి? పులివెందుల కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు మంజూరు చేస్తే, వద్దంటూ లేఖ రాయడం ఏంటి? మెడికల్ కాలేజీలను ప్రైవేట్ పరంచేసే స్కామ్‌లకు ఆలోచన చేయడం ఏంటి?

**ప్రైవేటు మీద అంతమోజు ఎందుకు?**

కోవిడ్ లాంటి సంక్షోభం ఉన్నప్పటికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మెడికల్ కాలేజీల నిర్మాణాల కోసం రూ.2403 కోట్లు ఖర్చు చేసి, ఐదు కాలేజీల్లో క్లాసులు మొదలుపెట్టి, మరో ఐదు కాలేజీలను ఈ ఏడాది నుంచే బోధనకు సిద్ధం చేశాం. మీ ప్రభుత్వం కూడా క్రమంగా ఖర్చు చేసుకుంటూ వెళ్తే మిగిలిన కాలేజీలు కూడా అందుబాటులోకి వస్తాయన్నది వాస్తవం కాదా? ఇలా చేయకుండా భారం అంటూ చేతులు దులిపేసుకుని ప్రజారోగ్య సంస్థలను అమ్మేస్తారా? ప్రైవేటు మీద మీకు అంత మోజు ఎందుకు? ప్రభుత్వ సంస్థలంటే అంత అసహ్యం ఎందుకు?

**కోవిడ్‌లో ఆదుకున్నది ప్రజారోగ్య రంగమే**

కొత్త మెడికల్ కాలేజీల నిర్వహణలో ఇబ్బందులు రాకూడదు, అదే సమయంలో పేద విద్యార్థులకు నష్టం కలగ కూడదన్న విధానంలో మేం సీట్లను భర్తీ చేస్తే, ఎన్నికల్లో ఓట్ల కోసం నానా రాద్ధాంతం చేశారు. అధికారంలోకి వస్తే మొత్తం సీట్లన్నీ ఫ్రీ అన్నారు. సీట్ల సంగతి దేవుడెరుగు.. ఇప్పుడు ఏకంగా కాలేజీలనే అమ్మేస్తున్నారు. ఇది ఏరు దాటాక తెప్ప తగలేయడం కాదంటారా? మోసం చేయడమే మీ నైజమని మరోసారి బయట పడ్డారు. పార్లమెంటు నియోజకవర్గానికో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఉంటే, అది ఆ నియోజకవర్గంలో ఉన్న ఏరియా ఆస్పత్రులకు, సీహెచ్‌సీలకు, పీహెచ్‌సీలకు, విలేజ్ క్లినిక్స్‌కు మార్గదర్శిగా ఉంటుంది. ఆ జిల్లా స్థాయిలో సూపర్ స్పెషాల్టీ సేవలు కూడా పేదలకు ఉచితంగా అక్కడే లభిస్తాయి. అలాంటి కాలేజీలను ప్రైవేటు పరం చేస్తే ముందుగా నష్టపోయేది పేద విద్యార్థులే కాదు, అక్కడి ప్రజలు కూడా. వారికి నాణ్యమైన వైద్యం అందదు సరికదా.. ప్రైవేటు ఆస్పత్రుల మధ్య పోటీ లోపించి వైద్యం కోసం వసూలు చేసే ఫీజులు ఆకాశాన్ని అంటుతాయి. ఎప్పుడైనా ప్రైవేటుకు గవర్నమెంటు పోటీగా ఉంటేనే, రేట్లు రీజనబుల్‌గా ఉంటాయి. కాలేజీలను ప్రైవేటీకరించాలన్న మీ విధానం అందరినీ దెబ్బ తీస్తుందనడం వాస్తవం కాదా? అటు ప్రజలను, ఇటు పిల్లలను కోవిడ్ లాంటి మహమ్మారి సమయంలో ఆదుకున్నది ప్రజారోగ్య రంగమే అని గుర్తించకపోతే ఎలా చంద్రబాబూ? పేదలకు ఉచితంగా మంచి వైద్యం అందకూడదన్నదే మీ విధానమని తెలుస్తోంది.



## అంతకపేట గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన మార్క అనిల్ గౌడ్.

జనసముద్రం న్యూస్ హుస్నాబాద్ (సతీష్ ఎర్రోళ్ల) సెప్టెంబర్15:

ఈరోజు హుస్నాబాద్ మండలంలోని గాంధీనగర్ అక్కన్నపేట మండల కేంద్రంతో పాటు అంతక పేట గ్రామాల్లో బాధిత కుటుంబాలను పరామర్శించిన బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి మరియు హుస్నాబాద్ నియోజకవర్గ గౌడ సంఘం చైర్మన్, కాంగ్రెస్ నాయకులు మార్క అనిల్ గౌడ్.ఈ కార్యక్రమాల్లో అక్కన పేట కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు జంగపల్లి ఐలయ్య , గాంధీనగర్ మాజీ సర్పంచ్ హుస్నాబాద్ నియోజకవర్గ గౌడ సంఘం కార్యదర్శి బొంగోని శ్రీనివాస్ గౌడ్, హుస్నాబాద్ నియోజకవర్గం గౌడ సంఘం కార్యదర్శి జాగిరి రవీందర్ గౌడ్, శివ గౌడ్,సాగర్ గౌడ్,రమేష్ గౌడ్ అంతకపేట గ్రామ నాయకులు బండి శ్రీనివాస్,కాసబోయిన రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రి అసెంబ్లీలో తీర్మానం చేసి మాట నిలబెట్టుకోవాలి - గోపి రజక

### - అన్నారంలో కమ్యూనిటీ హాల్కు ఎకర భూమి కేటాయించాలి - సి.వెంకటప్ప

జనసముద్రం న్యూస్:(సెప్టెంబర్ 15) హుజురాబాద్. వికారాబాద్ జిల్లా కొడంగల్ మండలం అన్నారంలో తెలంగాణ రజక రిజర్వేషన్ సమితి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ సి.అశోక్,జిల్లా సంయుక్త కార్యదర్శి సి.వెంకటయ్య అధ్యక్షతన,ఆదివారం ఏర్పాటు చేసిన ఎస్సీ రిజర్వేషన్ అవగాహన సమావేశానికి రాష్ట్ర అధ్యక్షులు గోపి రజక హాజరై మాట్లాడుతూ...ఓటమే ఎరుగని నాయకుడిగా రాష్ట్రంలోని అన్ని కులాల పట్ల సంపూర్ణ అవగాహన ఉన్న వారు రజక కులస్తులను ఎస్సీ జాబితాలో చేర్చాలని 2016 డిసెంబర్ 26న అసెంబ్లీలో మాట్లాడటం చాలా సంతోషకరమైన విషయం కానీ నేడు వారే ముఖ్యమంత్రి హోదాలో ఉన్నారు,కావున తక్షణమే అసెంబ్లీలో తీర్మానం చేసి అన్నమాటను నిలబెట్టుకోవాలని కోరారు.అదేవిధంగ మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కలలను సాకారం చేయాలని అన్నారు.జిల్లా సంయుక్త కార్యదర్శి సి.వెంకటయ్య మాట్లాడుతూ.. అన్నారంలో బట్టలు ఉతకడానికి సుదూర ప్రాంతాలకు వెళ్లవలసి వస్తుంది..కావున అందుబాటులో ధోభీ ఘాట్,కమ్యూనిటీ హాల్ కు ఎకర భూమి కేటాయించి నిధులు మంజూరు చేసి నిర్మించాలని కోడంగల్ ఎమ్మెల్యే,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కోరారు.కోడంగల్ నియోజకవర్గంలో ఉన్న ప్రతి మండల కేంద్రంలో ఆధునిక ధోభీ ఘాట్లతో పాటు చాకలి ఐలమ్మ ఆత్మగౌరవ భవనాలు నిర్మాణం చేయాలని కోరారు.కార్యక్రమంలో డిస్ రాములు,గడ్డమీది రాములు,సందుల వెంకటయ్య, కథాంశాన్ని, పెద్ద వెంకటయ్య,శ్రీనివాస్,కె.ఎల్లప్ప,చిన్న వెంకటప్ప,గడ్డం కాశప్ప, మేస్త్రి బందెప్ప,ఇందిరమ్మ,కె.ఆశప్ప,కె. ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.



## సూర్య తేజ యూత్ అసోసియేషన్ గణపతి మండపంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం.

### గణనాథునికి ప్రత్యేక పూజలు చేసిన హుజురాబాద్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్

జనసముద్రం న్యూస్:(సెప్టెంబర్ 15) హుజురాబాద్. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకొని, కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ పట్టణ కేంద్రంలో గల సూర్యతేజ యూత్ అసోసియేషన్ వినాయక మండపంలో హుజురాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం చేశారు. చైర్ పర్సన్ గందె రాధిక శ్రీనివాస్ మాట్లాడుతూ..గణనాథుని భక్తిశ్రద్ధలతో పూజిస్తే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని,హుజురాబాద్ పట్టణ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని గణనాథుడ్ని వేడుకున్నట్టు పేర్కొన్నారు.యూత్ సభ్యులు మణిదీప్, బాచి,అనిల్, రమాకాంత్,అరుణ్,బోసు, సాయి,కృష్ణ,కాలనీవాసులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## 11.13 14.వార్డ్ వేల్పుల సత్యం కాలనీ, వినాయకున్ని దర్శించుకున్నఅర్బన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15

మహబూబాబాద్ పట్టణ కేంద్రంలో 13 వ వార్డు లో కాంగ్రెస్ పార్టీ యూత్ నాయకులు ఆహ్వానం మేరకు , వినాయకుని దర్శించుకుని మొక్కలు చెల్లించుకున్న మహబూబాబాద్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఘణపురపు అంజయ్య అనంతరం అన్నదానం కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది.వారితో పాటు ఈ కార్యక్రమంలో...14 వార్డ్ కౌన్సిలర్ పోతురాజు టి పి సి సి ఓ బి సి స్టేట్ జాయింట్ కోఆర్డినేటర్ పింద్రాల రాందాసుఐ ఎన్ టి యూసి టౌన్ అధ్యక్షులు మందాటీ శ్రీనివాస్టౌన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి,బండారీ చిరంజీవి,, తదతరులు పాల్గొన్నారు..

# కల్వల శ్రీ వరసిద్ధి వినాయక మండలి ఆహ్వానం మేరకు ఏకదంతుని పూజల్లో పాల్గొన్న చిలువేరు సమ్మి గౌడ్

### గణనాధుని ఆశీస్సులతో పాటు భక్తమండలి తల్లుల ఆశీర్వాదం అందుకున్న చిలువేరు సమ్మయ్య గౌడ్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15

మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కల్వల గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక భక్తమండలి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో కల్వల పాత గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గరలో గత కొన్ని సంవత్సరాలుగా నిర్వహిస్తున్న భక్త మండలి తల్లుల ఆహ్వానం మేరకు విచ్చేసి ఏకదంతుని నవరాత్రి ఉత్సవాలలో భాగంగా భక్తి శ్రద్ధలతో మహిళా మణులందరితో గణపతి ప్రత్యేక పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు చిలువేరు సమ్మయ్య గౌడ్..ఈ సందర్భంగా చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ మండలంలో, జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇంతమంది మహిళా తల్లులు గణపతి నవరాత్రి ఉత్సవాలు నిర్వహించడం దానిలో భాగంగా నాకు మీ అందరితోపాటు పూజా కార్యక్రమంలో పాల్గొని ఆ దేవుడి ఆశీస్సులను అందించడం తో పాటు, వందల మంది మాతృ సమానులైన తల్లుల అందరి ఆశీర్వాదం నాకు దక్కినందుకు సంతోషంగా ఉందని ఆనందాన్ని వ్యక్తపరిచారు..నాకు ఇంతటి అవకాశాన్ని కల్పించిన శ్రీ వరసిద్ధి వినాయక భక్తమండలి ఉత్సవ కమిటీ తల్లులందరూ వారు వారి కుటుంబసభ్యులతో సహా, కల్వల గ్రామ ప్రజలందరు పాడి, పంటలతో,సుఖసంతోషాలతో అయురారొగ్యాలతో,సిరి సంపదలతో నిండు నూరేళ్లు ఆనందంగా ఉండాలని కోరుకున్నారు సమ్మి గౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్...అదేవిధంగా మహిళా మణులందరూ మేము ఏది అడిగిన లేదు అనకుండా, మమ్మల్ని తన తల్లుల్లా భావించి మాకు అండగా నిలుస్తున్న మా కొడుకు సమ్మిగౌడ్ ఆనందంగా ఉండాలని, వారి సేవా గునానికి సంతోషం వ్యక్తపరుస్తూ ఆ గణనాధుని యొక్క కృపా కటాక్షాలు సమ్మి గౌడ్ కి వారి కుటుంబానికి నిండుగా ఉండాలని



మనస్ఫూర్తిగా కోరుకున్నారు...ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఎర్రంశెట్టి అశోక్, గాజుల రవి కళ్యాణ్,కొమ్మాల రమ,కొమ్మాల దేవమ్మ,కొమ్మాల పద్మ,గంట పద్మ,కోణ పద్మ,శీలం సుజాత, అల్వాల శైలజ,చెల్ల ధనమ్మ,దొంతు వీరమ్మ,అల్వాల పద్మ,చిట్టమల్లు ఉపేంద్ర, చింతకాని హేమలత,లక్కాకుల రజిత,ముప్ప కలమ్మ,మార్గం జయమ్మ,చీకటి స్వాతి, కొలిపాక కొమరమ్మ,కందునూరి హైమ,మార్గ%శీ% మౌనిక,చీకటి సరోజన,గంట విజయ, పెరటి శ్రీలత,కూన ఉమ,పెద్దార సుజాత,కొడకండ్ల హైమ,ఆరెందుల పద్మ,ఆరెంధుల శ్రీదేవి, చీకటి సరిత,గంట మంజుల,గిరగాని జయమ్మ,పెద్దారపు విజయ,చింతనూరి హేమలత, రామడుగు సుజాత, కొండేటి కళాధర్, పబ్బతి ప్రశాంత్ గౌడ్ తో పాటు గ్రామ పెద్దలు,కమిటీ సభ్యులు సకుటుంబ సపరివార సమేతంగా పాల్గొని గణనాధుని ఆశీస్సులు తీసుకున్నారు..



## అన్ని రాష్ట్రాలు సమగ్ర కుల గణన చేపట్టాలి

### - ఎంపీ ఈటల రాజేందర్

జనసముద్రం న్యూస్:(సెప్టెంబర్ 15) హుజురాబాద్.

దేశంలోని అన్ని రాష్ట్రాలు సమగ్ర కులగణన చేపట్టాలని బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ డిమాండ్ చేశారు. తెలంగాణతో పాటు అన్ని రాష్ట్రాలు స్పందిస్తేనే బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అధ్యక్షతన కుల గణన అంశంలో హైకోర్టు తీర్పు - మేనిఫెస్టో అమలుకు తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కులగణన షెడ్యూల్డ్‌ను ప్రకటించాలని డిమాండ్ చేస్తూ అఖిలపక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పాల్గొన్న ఈటల రాజేందర్ మాట్లాడారు.రాష్ట్రంలో కులగణన జరిగితేనే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరుగుతుందన్నారు.రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ సమగ్ర కులగణనతో పాటు బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థలలో 42 శాతం పెంచాలని బలమైన ఉద్యమం చేపడతామని, అవసమైతే రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ కులగణన సకాలంలో పూర్తి చేస్తే సీఎం రేవంత్‌రెడ్డికి రాష్ట్రంలో మంచి పేరు వస్తుందని,ఆలస్యం చేయకుండా మూడు నెలల్లో పూర్తి చేయాలన్నారు.రైట్ టూ ఎడ్యుకేషన్ యాక్ట్‌ను రాష్ట్రంలో అమలు చేయాలని ఇందు కోసం త్వరలో సీఎంకు లేఖ రాస్తానని ఆయన అన్నారు.కార్యక్రమంలో డాక్టర్ వినయ్‌కుమార్,సీపీఐ ఎంఎల్ నాయకుడు కె.గోవర్ధన్, సీపీఎం నాయకులు అబ్బాస్, టీడీపీ నాయకుడు రామేశ్వర్‌తో పలు బీసీ సంఘాల నేతలు తదితరులు పాల్గొన్నారు.

## భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి కి ఘన నివాళులు సమర్పిస్తున్న ఉభయతెలుగు రాష్ట్ర ప్రజలు.



జనసముద్రం సెప్టెంబర్ 15 బ్యూరో చీఫ్, టి జి ఎ పి.బహుముఖ ప్రజ్ఞాశాలి భారతీయ ఇంజనీరింగ్ రంగంలో శ్రీశైల శిఖర సమానులు భారతరత్న డాక్టర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య గారి జయంతి సందర్భంగా ప్రజలందరికీ ఇంజనీర్స్ డే శుభాకాంక్షలు తెలియజేస్తు న్నట్లు గాయత్రీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు రామా వజ్జల. రవికుమార్ శర్మ తెలియజేశారు. మన దేశానికి ప్రత్యేకించి ఉభయ తెలుగు రాష్ట్రాలకు ఆ మహనీయుడు అందించిన సేవ లు ఎన్నటికీ మరువలేనివని పేర్కొంటూ భారతరత్న విశ్వేశ్వరయ్య గారి కి ప్రజలు ఘన నివాళు లు సమర్పిస్తున్నారని తెలిపారు.



## హిందూ ముస్లిం భాయ్ బాయ్

### మైనార్టీ మండల కాంగ్రెస్ సెల్ మండల అధ్యక్షులు ఎండి శ్యామ్

చిగురుమామిడి జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ 15:

నవా పేట గ్రామ బస్టాప్ పరిది లో ఉన్న గణేష్ చతుర్థి 8వ రోజు సందర్భంగా గ్రామ ప్రజల క్షేమం కోరి, పాడి పంటలతో సుఖ సంతోషాలతో జీవించాలని, హిందూ ముస్లిం కుల మత బేధాలు లేకుండా అందరూ కలిసి అన్నతమ్ముల ఉండాలని కోరుతూ ప్రత్యేక పూజలు జరిపించిన తాజా మాజీ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్ మరియు కాంగ్రెస్ మండల మైనార్టీ సెల్ అధ్యక్షులు %ఎం% షాబోద్దిన్, ఠాకూర్ దీలిప్ సింగ్, ఎన్నం సంతోష్, గూళ్ళ సమ్మయ్య, మరియు భక్తులు పాల్గొన్నారు.





## రెండో విడత దళిత బంధు ఇవ్వాలని అర్ధ నగ్న ప్రదర్శన. పథకాన్ని అమలు చేయకుంటే పట్నం దాకా పోరు కు సై.

జనసముద్రం జమ్మికుంట (టౌన్) న్యూస్ ప్రతినిధి:15 సెప్టెంబర్

కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ నియోజకవర్గం లో గల పైలెట్ ప్రాజెక్టు దళిత బంధు పథకం లబ్ధిదారులకు రెండో విడత నిధులు మంజూరు కాకపోవడంతో ఆదివారం రోజున స్థానిక జమ్మికుంట గాంధీ చౌరస్తాలో అర్ధనగ్న ప్రదర్శన చేపట్టారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అర్హులైన వారు ఉన్నప్పటికినీ స్థానిక బి ఆర్ ఎస్ లీడర్లు క్షేత్రస్థాయిలో దళిత బంధు పథకాన్ని అమలు చేయడంలో విఫలమయ్యారు. ఒక్కో యూనిట్ ఎంపికలో రూ:10 లక్షలకు గాను మూడు లక్షలు ముట్టచెబితేనే పథకాన్ని అందిస్తామని నమ్మ బలికి, కండిషన్లు విధించడంతో కొంతమంది దళితులు ఆ దళిత బంధు పథకాన్ని అందుకోలేకపోయారని హుజురాబాద్ నియోజకవర్గం లో చర్చనీయాంశగా మారింది. ఈ అర్ధ నగ్న ప్రదర్శనలో హుజురాబాద్ నియోజకవర్గంలోని జమ్మికుంట మండలంలో గల పలు గ్రామాలకు చెందిన దళిత సామాజిక వర్గానికి చెందిన కుటుంబాలు రోడ్డుకెక్కాయి.దళిత బంధు ఇప్పించాలంటూ దళిత సామాజిక వర్గానికి చెందిన మహిళలు కూడా పోరుబాట పట్టారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం యధావిధిగా దళిత బంధు పథకాన్ని పేరు మార్చి అయినా 'అంబేద్కర్ అభయ హస్తం" నామకరణంతో అర్హులైన వారికి రెండో విడత నిధులు మంజూరు చేయాలంటూ అర్ధ నగ్నంగా నిరసన వ్యక్తం చేశారు. రెండో విడత దళిత బంధు పథకాన్ని అందజేయకుంటే హైదరాబాదులోని ఇందిరాపార్క్ వద్ద పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని లబ్ధిదారులు మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు.



## అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమైక్య (ఏ ఐ ఎఫ్ టి ఓ) జాతీయ కౌన్సిల్ సమావేశంలో పాల్గొన్న పీ.ఆర్.టీ.యు తెలంగాణ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్.

జనసముద్రం న్యూస్:(సెప్టెంబర్ 15) హుజురాబాద్.

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం లక్నోలో జరుగుతున్న అఖిల భారత ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ( ఏ ఐ ఎఫ్ టి ఓ ) జాతీయ కౌన్సిల్ సమావేశంలో ఉపాధ్యాయ సంఘం ప్రతినిధిగా పి ఆర్ టి యు తెలంగాణ బృందంతో జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షులు రాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు పాల్గొని ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై చర్చించారు.పి ఆర్ టి యు తెలంగాణ సంఘం నుండి రాష్ట్ర అధ్యక్షులు ముదిరేసి చెన్నయ్య,ప్రధాన కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్లా, ఏ ఐ ఎఫ్ టి ఓ మహిళ వైస్ చైర్ పర్సన్ గోలి పద్మ,తో పాటు రాచర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.వీరు తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలపై వివిధ రాష్ట్రాల ప్రతినిధులతో చర్చించి నూతనమైన విద్యా విధానాలను రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం చేస్తారు.రాష్ట్రం నుండి ప్రతినిధిగా ఎన్నిక కావడానికి సహకరించి రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చెన్నయ్య,అబ్దుల్లా మరియు రాష్ట్ర,వివిధ జిల్లాల సభ్యులకు,జయశంకర్ భూపాలపల్లి జిల్లా కమిటీకి రాచర్ల శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు.

# కమ్యూనిస్టుల వల్లనే తెలంగాణ భారతదేశంలో విలీనం అయింది

## సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు.



బోనకల్, మధిర నియోజకవర్గం, ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 15 :- భారతదేశంలో తెలంగాణ ప్రాంతం విలీనం కావటానికి కమ్యూనిస్టుల తోనే సాధ్యం అయిందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు భాగం హేమంతరావు అన్నారు. తెలంగాణ సాయుధరైతంగా పోరాటం వార్షికోత్సవ వారోత్సవాల సందర్భంగా బోనకల్ మండలం రాపల్లి, బ్రాహ్మణపల్లి గ్రామాలలో అమరవీరుల స్తూపాలకు సిపిఐ జిల్లా కార్యదర్శి తో కలిసి ఆయన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తెలంగాణ భారతదేశంలో విలీనం అయింది అంటే దానికి కారణం కేవలం కమ్యూనిస్టులు మాత్రమే అన్నారు. ఏడవ నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ తెలంగాణ ప్రాంతాన్ని ప్రత్యేక దేశంగా ప్రకటించుకున్న తర్వాత రావి నారాయణరెడ్డి, మహమ్మద్ ముగ్దం మోహినుద్దీన్, బద్దం ఎల్లారెడ్డి ల నాయకత్వంలోని కమ్యూనిస్టులు సాయుధ పోరాటానికి పిలుపునిచ్చారన్నారు. నాడు తెలంగాణలో ఉన్న అరాచక పాలన కు వ్యతిరేకంగా, నిరంకుశత్వానికి, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన మహత్తర పోరాటమే తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం అని ఆయన కొనియాడారు. పదివేల గ్రామాలలో విముక్తి చెంది ఉండటం తో పాటు అణగారిన వర్గాలకు పది లక్షల ఎకరాలను పంపిణీ చేసిన ఘనత కమ్యూనిస్టు పార్టీకే ఉందన్నారు. బోనకల్లు మండలం చిరునోముల గ్రామానికి చెందిన రావెళ్ళ జానకిరామయ్య ఈ ప్రాంతానికి తొలి కమ్యూనిస్టు గా చెప్పవచ్చు అన్నారు. ఆయనతోపాటు రాయన పేట గ్రామానికి చెందిన పారుపల్లి రామకోటయ్య, బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన గాదె మాధవరెడ్డి, పారుపల్లి పుల్లయ్య , పైడిపల్లి జోగయ్య , గాదె పిచ్చిరెడ్డి , జెర్రిపోతుల రాజారత్నం, లక్ష్మీపురం గ్రామానికి చెందిన మల్లెల వెంకటేశ్వర్లు, సీతానగరం గ్రామానికి చెందిన తాళ్లూరి భద్రయ్య, గోవిందా పురం గ్రామానికి చెందిన జొన్నలగడ్డ రామయ్య, తమ్మరపు గోవిందు తదితరులు దళం గా చేరి ఈ ప్రాంతంలో రజాకార్ల ఆగడాలను హరికట్టారన్నారు. మధిర తాలూకాకే చెందిన నల్లమల గిరి ప్రసాద్ కొత్తగూడెం ప్రాంతంలో దళ కమాండర్ గా పని చేశారని ఆయన గుర్తు చేశారు. బ్రాహ్మణపల్లి గ్రామంలో పోరాట సమయంలో బేస్ క్యాంపు ఉండేదని, గాద మాధవరెడ్డిని, పైడిపల్లి జోగారావు లను హత్యగావించిన అనంతరం ప్రజలందరూ క్యాంపుపై తిరగబడి దాడి చేసి పారగోట్టారన్నారు. అందరికీ తెలిసి 4,000 మంది అమరులైతే తెలియకుండా చనిపోయిన వారు ఎందరో ఉన్నారు అన్నారు. ఈ మహత్తర పోరాట చరిత్రను వక్రీకరిస్తున్నారని, ఇది మతపరమైన టువంటి పోరాటంగా చిత్రీకరించడానికి బిజెపి కుట్రలు పన్నుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాఠ్య పుస్తకాల్లో ఈ చరిత్రను ప్రచురిస్తే రాబోయే తరాలకు చరిత్ర అర్థమవుతుందని ఆయన ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జమ్మల జితేందర్ రెడ్డి, ఎర్రబాబు, ఏపూరి లతా దేవి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సింగ్ నరసింహారావు, తాటి వెంకటేశ్వర్లు, పోటు కళావతి, సిహెచ్ సీతామహాలక్ష్మి ,తోట రామాంజనేయులు, రావి శివరామకృష్ణ, సిపిఐ మండల కార్యదర్శి యంగల ఆనందరావు, జిల్లా సమితి సభ్యులు ఏనుగు గాంధీ, తూము రోషన్ కుమార్, ఏఐవైఎఫ్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రావణ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటిక్యాల రామకృష్ణ, అధ్యక్షులు మడుపల్లి లక్ష్మణ్, మండల నాయకులు ఏనుగు రవికుమార్, ఏనుగు రామకృష్ణ, ఏలూరు రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయకులు శివ, పవన్ , జక్కుల నిఖిల్, వంశీ, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

# నూతనంగా పీసీసీ అధ్యక్షుడి గా ప్రమాణస్వీకారం చేస్తున్న మహేష్ కుమార్ గౌడ్ ఘనంగా సన్మానిస్తున్న పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్



జన సముద్రం జిల్లా ప్రతినిధి:- హైదరాబాద్ గాంధీ భవన్ లో నూతనంగా తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడిగా నియమితులై ప్రమాణ స్వీకారం చేస్తున్న శ్రీ బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ గారిని పీసీసీ ప్రధాన కార్యదర్శి పోత్నక్ ప్రమోద్ కుమార్ భువనగిరి పట్టణ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు పడిగెల ప్రదీప్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకురావడానికి అహర్నిశలు కృషి చేసిన ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్తలకు పార్టీలో సరైన గుర్తింపు ఉంటుంది రానున్న స్థానిక సంస్థ ఎన్నికలలో అవకాశాలు కల్పిస్తామని అన్నారు ఎస్సీ ఎస్టీ బడుగు బలహీన వర్గాల మరియు మైనార్టీ వర్గాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ కడుపులో పెట్టి చూసుకుంటుందని వాళ్ల సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను ఇప్పటికే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, 500 కే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్ సౌకర్యం, 10 లక్షల వరకు ఉచితంగా వైద్యం చేసుకోవడం కోసం ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలు చేస్తుందని అన్నారు రానున్న సర్పంచ్ ఎంపిటిసి జడ్పిటిసి కార్పొరేషన్ మున్సిపల్ లలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగర వెయ్యడం కోసం ప్రతి ఒక్క కాంగ్రెస్ కార్యకర్త సైనికులుగా పనిచేసే కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కృషి చేయాలని అన్నారు భావి భారత ప్రధాని శ్రీ రాహుల్ గాంధీ గారిని ప్రధానమంత్రి చేసేంతవరకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పార్టీ కోసం పని చేస్తూ నిత్యం ప్రజల మధ్యలో ఉంటూ ప్రజా సమస్యలు తెలుసుకొని ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని అలాగే కాంగ్రెస్ పార్టీపై బిజెపి పార్టీ బోకాస్ సోషల్ మీడియా ద్వారా చేస్తున్న ప్రచారాలను కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ద్వారా ఎప్పటికప్పుడు తిప్పికొట్టాలని బిజెపి పార్టీకి సరైన బుద్ధి చెప్పాలని అన్నారు ఈకార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఎలిమినేటి కృష్ణారెడ్డి వడిచర్ల శరత్ యాదవ్ దాసరి మధు ప్రభాకర్ సాయి తదితరులు పాల్గొనడం జరిగింది

# బాబునాయక్ తండాలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన శ్రీసత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిట్రబుల్ ట్రస్ట్



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15

మహబూబాబాద్ మండల పరిధిలో శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్, ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్య శిబిరంలో శ్రీ విజయ హాస్పిటల్, శ్రీ సీతారామ మెమోరియల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో మానుకోట జిల్లా మున్సిపాలిటీ బాబునాయక్ తండా ప్రాథమిక పాఠశాల నందు ఏర్పాటుచేసిన ఉచిత మెగా వైద్య శిబిరంలో బాబునాయక్ తండా, పత్తిపాక, మంగళ కాలనీ, సాంక్రియ తండా ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ మెగా వైద్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్లు. శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ రొయ్యూరు సురేష్, డాక్టర్ దారావత్ రెడ్డి నాయక్ కంటి వైద్య నిపుణులు, డాక్టర్ కవిత కంటి వైద్య నిపుణులు, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ నందు జనరల్ ఐ చకప్, గ్లాకోమా, మెల్లకన్ను, కాంటాక్ట్ లెన్సెస్, హైమోఫియా కొరకు ఐసిఎల్, స్పెషాలిటీ సర్వీసెస్, కార్నియా, ట్రోపోగ్రఫీ కెరటోకోనస్, రెటీనా, లేజర్ కంటి ఆపరేషన్, రెటినాల్ వాస్కులర్ డిజార్డర్స్, ఊవీయా, ప్లాస్టిక్ సర్జరీ, అదేవిధంగా మానుకోట జిల్లా పట్టణ గ్రామీణ ప్రాంతాల వారికోసం ప్రారంభించిన శ్రీ సత్య లయన్స్ కంటి హాస్పిటల్ లో అత్యాధునికమైనా పరికరాలతో కంటి పరీక్షలు, ఫెకో సర్జరీ, లాసిక్ సర్జరీ, కంటి ఆపరేషన్లు చేసి, కంటిలో శుక్లాలను పొరలను ఇంజక్షన్ ఇవ్వకుండా, పట్టి కట్టకుండా, కట్టు వేయకుండా, నొప్పి లేకుండా, సూపర్ లేజర్ ఆపరేషన్లు చేస్తారు. అదేవిధంగా షుగర్ వ్యాధిగ్రస్తులకు, అధిక పోటుతో వచ్చే బిపి ఉన్న వ్యాధిగ్రస్తులకు ప్రత్యేకమైన చికిత్స అందుబాటులో కలదు, కంటిలో పెరిగే మాంసముకు కుట్టు లేకుండా గ్లూ తో ఆపరేషన్ చేస్తారు. గ్లోకోమాకు, ప్రత్యేక నిపుణుల ఆధ్వర్యంలో చికిత్స, దగ్గర చూపుకు, దూరం చూపుకు, మెడ నొప్పులకు, తలనొప్పికి సరసమైన ధరలకే అద్దాలు, పోగ్రెసివ్, క్రిజల్, ఫినోలెన్స్ అతి తక్కువ ధరలకే ఇస్తారు. డాక్టర్ జాటోత్ వేణు ఫిజియోథెరపిస్ట్, శ్రీ సీతారామ్ మెమోరియల్ దవాఖాన, కన్సల్టెంట్ డాక్టర్ బి.జగదీశ్వర్ ఎంఐడి. పెడియట్రిక్స్ పిల్లల ప్రత్యేక వైద్య నిపుణులు, డాక్టర్ డి. విజయశ్రీ, ఎంబిబిఎస్, ఎండీ (గాంధీ ) జనరల్ మెడిసిన్, డాక్టర్ బి. రాము నాయక్ ఎంబిబిఎస్, ఎం.డీ పాల్గొన్నారు. ఈ సందర్బంగా డాక్టర్ రెడ్డి నాయక్ మాట్లాడుతూ మన బాబునాయక్ తండాలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి. పేద, మధ్య తరగతి కుటుంబాల వారు ఎక్కువ మంది ఉన్నందున, ప్రతి గ్రామంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేస్తున్నాం. కావున సీజనల్ కాకుండా వేరే వ్యాధులకు కూడా డాక్టర్లు ఉన్నందున, ఈ మెడికల్ క్యాంప్ నందు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చి విజయవంతం చేస్తున్నందుకు ధన్యవాదాలు. ఈ మెడికల్ క్యాంపు నందు పలు రకాల మందులు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం వైద్య శిబిరంలో పాల్గొన్న రోగులకు, పిల్లలకు న్యూట్రిషన్ కిడ్స్ పంపిణీ చేసి, భోజన సదుపాయం ఏర్పాటు చేశారు. ఈ వైద్య శిబిరంలో పాల్గొన్న ఫిజియోథెరపి డాక్టర్ జాటోత్ వేణు నాయక్, బానోత్ రమేష్, బానోత్ భాస్కర్, సర్వన్, శ్రీ సత్య లయన్స్ ఐ హాస్పిటల్ మేనేజర్ ధారావత్ బాలునాయక్, పిఆర్ఓ మోహన్ నాయక్, శ్రీ విజయ హాస్పిటల్ సూపర్వైజర్ వసంత్ కుమార్, ప్రమీల, రాజశేఖర్, అంగోత్ అఖిల్ నాయక్, రూప్ సింగ్, సక్రం, భూక్యా నాచ, ఆంగోత్ బానోత్ సోములు, రాంచందర్, కృష్ణ, తండా యూత్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



## నేతాజీ యూత్ ఆధ్వర్యంలో లక్ష్మణ్ జి జ్ఞాపకార్థంగా అన్నదానం

జన సముద్రం జిల్లా ప్రతినిధి:-భువనగిరి పట్టణంలోని శ్రీ నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో కీర్తిశేషులు హీరే కార్ లక్ష్మణ్ జి జ్ఞాపకార్థం హీరే కార్ లక్ష్మణ్ జి కుటుంబ సభ్యులు గణేష్ మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మున్సిపల్ చైర్మన్ పోతంశెట్టి వెంకటేశ్వర్లు హాజరై అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు మున్సిపల్ వైస్ చైర్మన్ మాయా దశరథ పిసిసి కార్యదర్శి తంగళ్ళపల్లి రవికుమార్ గారు మాజీ మున్సిపల్ చైర్మన్ సుర్వి లావణ్య శ్రీనివాస్ గౌడ్ కౌన్సిలర్ రత్నాపురం బలరాం గారు శ్రీను గణేష్ నాగరాజ్ పాదరాజు సునీల్ నరేష్ సుదగాని సతీష్ హరీష్ రూపేష్ నగేష్ మణికంఠ అలాగే నేతాజీ యువ సంఘం యూత్ సభ్యులు బాల గణేష్ యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.



## జిట్టా చిత్రపటానికి నివాళులర్పించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి సాయి కన్వెన్షన్ హాల్లో స్వర్గీయ జిట్టా బాలకృష్ణ రెడ్డి చిత్రపటానికి నివాళ్లు అర్పించిన బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.వారితోపాటు మాజీ మంత్రులు గుంటకండ్ల జగదీశ్వర్ రెడ్డి,మొహమ్మద్ అలీ,వి.శ్రీనివాస్ గౌడ్,ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యేలు పైళ్ళ శేఖర్ రెడ్డి,కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి,గొంగిడి సునీత మహేందర్ రెడ్డి,చిరుమర్తి లింగయ్య,బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చింతల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు



# సిరిపురం గ్రామానికి మహర్దశ

## గ్రామం మొత్తం ఉచిత విద్యుత్

## పైలట్ గ్రామంగా సిరిపురం ఎంపిక

## భట్టి విక్రమార్క కు కృతజ్ఞతలు తెలిపిన గ్రామ ప్రజలు

బోనకల్/మధిర నియోజకవర్గం, ఖమ్మం జిల్లా, జనసముద్రం న్యూస్, సెప్టెంబర్ 15:- మధిర మండలం సిరిపురం గ్రామంలో రైతుల పంపుసెట్లకు, ప్రతి ఇంటికి సోలార్ విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సోలార్ విద్యుత్ పైలెట్ ప్రాజెక్టులో భాగంగా మధిర మండలం సిరిపురం గ్రామం తో పాటు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వగ్రామం కొండారెడ్డిపల్లిని ఎంపిక చేయటం జరిగింది.



# అన్నంపట్ల గ్రామంలో గణపతి పూజలో పాల్గొన్న బొక్క జైపాల్ రెడ్డి

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల పరిధిలోని అన్నంపట్ల గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నెలకొల్పిన గణేశుని మండపం వద్ద గణేష్ నవరాత్రుల సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన బీబీనగర్ మండల మాజీ రైతుబంధు సమితి కోఆర్డినేటర్ బొక్క జైపాల్ రెడ్డి.అనంతరం వారికి గౌడ సంఘం సభ్యులు ఘనంగా సన్మానం చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో గౌడ సంఘం పెద్దలు,గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



## జిట్టా చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి,కుంభం

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మండలం బొమ్మాయిపల్లి జిట్టా గెస్ట్ హౌస్ లో తెలంగాణ ఉద్యమ నేత స్వర్గీయ జిట్టా బాలకృష్ణారెడ్డి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గోని వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి,మునుగోడు ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి.వారితో పాటు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు గోలి పింగల్ రెడ్డి తదితరులు ఉన్నారు.



## గణేష్ ఉత్సవ శోభాయాత్ర,నిమజ్జనంకు సర్వం సిద్ధం

### - జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15 మానుకోట పట్టణ పరిధిలో నిజాం చెరువులో రేపు జరిగే గణేష్ నిమజ్జనం ఏర్పాట్లను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్,ఎస్పీ సుధీర్ ఆర్ కేకన్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) లెనిన్ వత్సల్ టోప్పో, తదితరులు,ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో రేపు జరగబోయే గణేష్ ఉత్సవ శోభాయాత్ర, నిమజ్జనం, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు,పట్టణంలోని ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్, శాంతి భద్రతల సమస్య రాకుండా పోలీసులు ముందస్తు ప్రణాళికలతో ఉన్నారని, షెడ్యూల్ ప్రకారం గణేష్ నిమజ్జనం కార్యక్రమం పూర్తి చేయుటకు సిబ్బంది అందరూ వారికి కేటాయించిన విధులను నిర్వహించాలని ఆదేశించారు, చెరువు వద్ద గజఈత గాళ్లను, లైఫ్ జాకెట్లు, బోట్లు సిద్ధంగా ఉంచామన్నారు,మున్సిపల్ పరిధి, గ్రామాలలో సూచించిన చెరువులలో మాత్రమే నిమజ్జనం చేయాలన్నారు,పోలీస్,మున్సిపల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, విద్యుత్, తదితర శాఖలు కలిసి సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు,ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ఈ నరేష్, డీఎస్పీ తిరుపతి, జిల్లా మత్స్యశాఖ అధికారి వీరన్న, మున్సిపల్ కమిషనర్ రవీందర్, మున్సిపల్ డిఈ ఉపేందర్, స్థానిక తహసిల్దార్ భగవాన్ రెడ్డి, విద్యుత్ డిఈ విజయ్, సంబంధిత అధికారులు ఉన్నారు.

# అక్రమ కేసులపై మహిళల ఆగ్రహం

సెప్టెంబర్ 15 (జనసముద్రంన్యూస్ చింతపల్లి)

అక్రమంగా తమ కుటుంబ సభ్యులపై కేసులు బనాయించి వేధింపులకు గురి చేస్తున్నారని వింజమూరు గ్రామానికి చెందిన మహిళలు ఆదివారం మండల కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈనెల 12వ తేదీ రాత్రి ఓ వినాయక నిమజ్జనం కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న పలువురు దళితులను అదే గ్రామానికి చెందిన కొంతమంది కులం పేరుతో దూషించారు. మాదిగ కులానికి చెందిన మీరు మా బజారుకు ఎలా వస్తారని అవమానించడంతో ఆ కులానికి చెందిన యువకులు మమ్మల్ని కులం పేరుతో ఎలా దూషిస్తారని ప్రశ్నించారని మహిళలు తెలిపారు. దీంతో మమ్మల్ని మీరు ప్రశ్నిస్తారా? అని వారు కర్రలతో దళిత యువకులపై దాడి చేశారని వారు తెలిపారు. ఈ విషయంపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా స్థానిక ఎమ్మెల్యే, కాంగ్రెస్ నాయకుల ప్రోత్బలంతో దళిత యువకులపై, వారికి మద్దతు తెలిపిన వారిపై మొత్తం 17 మందిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి అక్రమంగా జైలుకు పంపారని మహిళలు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు ఎలాంటి విచారణ చేయకుండా అధికార పార్టీ నాయకులు చెప్పిందే వేదంగా గ్రామంలో ఎలాంటి విచారణ చేపట్టకుండా జైలుకు పంపారని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా వింజమూరు గ్రామానికి చెందిన నూనె సంతోష, పందుల తిరుపతమ్మ పై పలువురు వ్యక్తులు బీరు. సీసాలతో, కర్రలతో దాడి చేసి చంపుతామని వెంబడించి నానా బూతులు తిట్టి భయభ్రాంతులకు గురి చేశారన్నారు. దళితులను కులం పేరుతో అవమానించి, మహిళలపై దాడి చేసిన వ్యక్తులపై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినప్పటికీ వారు అధికార పార్టీకి చెందిన వారి ఫిర్యాదులను మాత్రమే పరిగణలోకి తీసుకొని, కాంగ్రెస్ పార్టీ కాని వారి ఫిర్యాదులను పట్టించుకోవడంలేదని విమర్శించారు. ఇదేమని ప్రశ్నిస్తే సీఐ నవీన్ కుమార్, ఎస్సై యాదయ్యలు బెదిరింపులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు



కాంగ్రెస్ ఏజెంట్లుగా పని చేస్తూ అమాయకులైన యువకులపై, ఇతర పార్టీ నాయకులపై రాజకీయపరమైన, ఉద్దేశపూర్వకమైన, కక్షలు పెంచుకొని అక్రమ కేసులు బనాయిస్తున్నారని మహిళలు అన్నారు. వింజమూరు గ్రామానికి చెందిన ఓ మాజీ ఎంపీటీసీ కోరికతో ఎమ్మెల్యే గ్రామ యువకులను తీవ్ర హింసలకు గురి చేస్తున్నారని వారన్నారు. అకారణంగా కులం పేరుతో దూషించి, మహిళలపై దాడి చేసిన వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని మహిళలు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాబోయే కాలంలో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి, ఎస్పీ కార్యాలయాన్నీ ముట్టడించి, మానవ హక్కుల కమిషన్ ని ఆశ్రయిస్తామని వారు అన్నారు.



## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ భువనగిరి మున్సిపాలిటీ స్థానిక పహాడీ నగర్ మాజీ కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మహమ్మద్ లయిక్ అహ్మద్ వార్డు అభివృద్ధి కార్యలయంలో వారి చేతుల మీదుగా సి.ఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించడం జరిగింది.అందులో పట్టణంలోని 30వ వార్డ్ పహాడినగర్ కు చెందిన ఎండి.అంజత్ తండ్రి ఎండి.ఆఫ్జల్ రూ.36,000/- చెక్కును అందించడం జరిగింది.ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ ఎండి.లయిక్ అహ్మద్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ప్రతి ఒక్కరికి వైద్య సహాయం కొరకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల ద్వారా ప్రభుత్వం వైద్య సహాయం అందిస్తుందని అన్నారు.పదవిలో ఉన్న లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటు ఇప్పటివరకు దాదాపు 200 చెక్కులు ఇప్పించడం ఆనందంగా ఉందని అన్నారు.రాబోయే కాలంలో కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సేవకులు కార్యాలయం ద్వారా ఒక సేవకున్నిలాగా పనిచేస్తానని వారు తెలిపారు.ఇది ప్రజా ప్రభుత్వం అని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు ఎండి.సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## విగ్నేష్ యూత్ ఆధ్వర్యంలో ఘనంగా గణేశ్ ఉత్సవాలు

### వ్యవసాయ శాఖ రిటైర్డ్ ఏఈఓ దైద కృష్ణయ్య జ్ఞాపకార్థం

### కుటుంబ సభ్యుల అన్నదాన కార్యక్రమంనిర్వహణ

### ముఖ్య అతిథులుగా దైద సత్యం, డా. మునీర్

జన సముద్రం న్యూస్, మిర్యాలగూడ, సెప్టెంబర్ 15 :

విగ్నేష్ యూత్ ఆధ్వర్యంలో పట్టణంలోని గాంధీనగర్ 35 వార్డులో గణేష్ ఉత్సవాలుఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో వ్యవసాయ శాఖ రిటైర్డ్ ఏఈఓ దైద కృష్ణయ్య జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ జాతీయ సీనియర్ నాయకులు దైద సత్యం జనయేత్రీ ఫౌండేషన్ చైర్మన్ డా. మునీర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..భక్తిశ్రద్ధలతో వినాయక చవితి పండుగను జరుపుకొని అన్నదాన కార్యక్రమం నిర్వహించడం చాలా హర్షించదగ్గ విషయమని, ఈ కార్యక్రమానికి మమ్మల్ని ముఖ్య అతిథులుగా ఆహ్వానించిన కమిటీ సభ్యులకు ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలియజేస్తున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం మిర్యాలగూడ పట్టణ అధ్యక్షులు దైద శ్రీనివాస్ , దైద కిరణ్ కుమార్, పి సైదులు, అనిల్, శివరాం, సందీప్, మహేష్, శివ, శశి, నిఖిల్, దైద సైదులు, జిల్లా వేణు, గోపి, శ్రీకాంత్, అవినాష్, వెంకటేష్, పవన్, శరత్ కుమార్, సతీష్, రాజమణి, భద్రమ్మ, రేణుక, సునీత, సరిత, కీర్తి, సైదమ్మ, సంధ్యారాణి, కీర్తన, నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ భవన్ లో పీసీసీ

## అధ్యక్షుడిగా బాధ్యతలు స్వీకరించిన మహేష్ కుమార్ గౌడ్



జనసముద్రం న్యూస్(సెప్టెంబర్ 15) హైదరాబాద్. గాంధీ భవన్ లో పీసీసీ అధ్యక్షుడిగా మహేష్ కుమార్ గౌడ్ బాధ్యతలు సకరించారు.పీసీసీ కుర్చీలో మహేష్ కుమార్ గౌడ్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కలు కూర్చోబెట్టారు.ఈ స్వీకారోత్సవానికి హాజరైన ఏఐ సీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ,ఏఐసీసీ సెక్రెటరీలు, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ముఖ్య నాయకులతో పాటు గాంధీ భవన్ కు భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చారు.





## ముదిరాజ్ యువసేన వారి

## వినాయక మండపంలో అన్నప్రసాద వితరణ

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:

జనసముద్రం న్యూస్ బీబీనగర్ మండల కేంద్రంలో ముదిరాజ్ యువసేన వారి వినాయక మండపంలో ప్రత్యేక పూజలో పాల్గొని అనంతరం వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య మహసభ జిల్లా అద్యక్షులు మల్లగారి శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి గోలి నరేందర్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు,యూత్ సభ్యులు,భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





## ఉపాధ్యాయులే సమాజ నిర్మాతలు

మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15

మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలంలో జరిగిన ట్రస్మా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం జరిగింది దీనిలో భాగంగా మహబూబాబాద్ పట్టణంలో స్థానిక గీతాంజలి హై స్కూల్ నుండి కొమ్ము వేణు మరియు వాండా ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపికయ్యారు వీరిని ట్రస్మ రాష్ట్ర కార్యవర్గం ఘనం గా సన్మానించారు ఈసందర్భంగా పాఠశాల డైరెక్టర్ కె.రామకృష్ణ వైస్ ప్రిన్సిపల్ మంజులమాట్లాడుతూ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల కృషి ఎంతో అవసరమని అన్ని వృత్తుల కన్న ఉపాధ్యాయవృత్తి ఎంతో గొప్పదని ఉపాధ్యాయులను గౌరవవిస్తే దేవుణ్ణి పూజించినట్లే అని అన్నారు ఉత్తమ ఉపాధ్యాయులు గా ఎంపిక చేసినందుకు ఉపాధ్యాయులు కొమ్ము వేణు మరియు వాండా ఉపాధ్యాయురాలు గీతాంజలి హై స్కూల్ యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు ఈ కార్యక్రమములో పాఠశాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## కొండూరు అనీత్ వర్మ

## పుట్టినరోజు సందర్భంగా అద్భుత అన్నదానం

### తల్లిదండ్రులు, సుధాకర్ రాజు, విష్ణు ప్రియ, సోదరి జస్విత,

రైల్వే కోడూరు జన సముద్రం న్యూస్ సెప్టెంబర్ 15

ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా, రాయచోటి పట్టణం నివాసులు ప్రభుత్వ ఉద్యోగులు కొండూరు. విష్ణు ప్రియ, కొండూరు సుధాకర్ రాజు దంపతుల ముద్దుల కుమారుడు కొండూరు.అనిత్ వర్మ పుట్టినరోజు సందర్భంగా కొండూరు. అనీత్ వర్మ, సోదరి కొండూరు జశ్విత,తల్లి కొండూరు. విష్ణు ప్రియ, తండ్రి కొండూరు సుధాకర్ రాజు, ఆంధ్రప్రదేశ్, అన్నమయ్య జిల్లా, రైల్వే కోడూరు నియోజకవర్గం, ఓబులవారిపల్లి మండలం, ముక్కావారి పల్లె సమీపంలోని 2:5కీ. మీ. దూరంలో అప్పారావు సర్కిల్ కాశీనగరం నందు వెలసి ఉన్న జీవనజ్యోతి ఆనంద నిలయం శాశ్విత నిత్య అన్నదాన ఆశ్రమం నందు 15-09-2024 న కొండూరు అనిత్ వర్మ పుట్టినరోజు వేడుకలు సందర్భంగా మధ్యాహ్నం 12:00 నుండి సాయంత్రం 3:00 గంటల వరకు అద్భుత అన్నదానం జరిపించారు. జీవనజ్యోతి ఆనంద నిలయం లోని చిన్నారులు, వృద్ధులు,దివ్యాంగులు, బాల బాలికలు, మరియు బాటసారిలు ఎంతోమంది ఆకలి తిర్చుకున్నారు. ఆకలి తీర్చు కున్న ప్రతి ఒక్కరూ కొండూరు అనిత్ వర్మ , వారికి ప్రత్యేకమైన పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి తల్లిదండ్రులు కొండూరు సుధాకర్ రాజు వారికి, కొండూరు విష్ణు ప్రియ వారికి మరియు హనిత్ వర్మ వారి సోదరి కొండూరు.జశ్విత వారికి ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలియజేస్తూ కొండూరు వారి కుటుంబం జీవితకాలమంతయుఆయుర్ ఆరోగ్యాలతో అష్ట ఐశ్వర్యాలతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని జీవనజ్యోతి ఆనంద నిలయం వారు ప్రత్యేకమైన ముక్కోటి దేవతల ఆశీర్వాదాలు ద్వారా తెలిపారు. ఇలాగే సమాజంలో ప్రతి ఒక్కరూ సేవ భావముతో పుట్టినరోజులు, పెళ్లిరోజు, మరి ఏ ఇతర శుభకార్యాలైన అన్నదానం జరిపించవలసిన వారు క్రింది ఫోన్ నెంబర్లను సంప్రదించవలెను 9703105755, 9014184279, 9030068619, 9440883354.




## ఉత్తమ ప్రతిభ కనబరిచిన

## బీబీనగర్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది

### -పెట్రోలింగ్ సిబ్బందికి ప్రశంస పత్రాలు,రివార్డులు అందించిన

### కమిషనర్ సుధీర్ బాబు

యాదాద్రి భువనగిరి జిల్లా సెప్టెంబర్.15,భువనగిరి నియోజకవర్గ ప్రతినిధి:



జనసముద్రం న్యూస్ బీబీనగర్:-రాచకొండ కమిషనరేట్ లో పెట్రోలింగ్ మరియు 100 డయల్ కాల్స్ లో భాగంగా ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు గాను బీబీనగర్ పోలీస్ స్టేషన్ పెట్రోలింగ్ సిబ్బంది అయిన పెట్రోల్ మొబైల్ ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ అరవింద్ మరియు డ్రైవర్ నరేష్ మరియు బ్లూ కోట్స్ సిబ్బంది అయిన నరేష్,హరి లకు కమీషనర్ సుధీర్ బాబు ఐపీఎస్,సిబ్బందికి ప్రశంస పత్రాలు మరియు రివార్డులు అందజేసారు.

## టిడిపి కార్యాలయ ప్రారంభోత్సవానికి మంత్రి రాంప్రసాద్ రెడ్డి

లక్కిరెడ్డిపల్లి రాయచోటి నియోజకవర్గం జనసముద్రం న్యూస్ సెప్టెంబర్ ,15




మండల కేంద్రంలోని ఇండియన్ పెట్రోల్ బంక్ ఎదురుగా తెలుగుదేశం పార్టీ కార్యాలన్నీ రాష్ట్ర రవాణా యువజన క్రీడ శాఖ మంత్రివర్యులు రాంప్రసాద్ రెడ్డి , లక్ష్మీ ప్రసాద్ రెడ్డి సోమవారం ప్రారంభోత్సవానికి హాజరు కానున్నారు. టిడిపి మండల యువ నాయకులు మాజీ ఎంపీటీసీ యనమల మదన్ మోహన్ పిలుపునిచ్చారు ఆయన మాట్లాడుతూ మండలంలో ఉన్న గ్రామాల కూటమి నాయకులకు సోమవారం ఉదయం 9 గంటలకు ఎమ్మార్వో ఆఫీస్ మిట్ట నుండి 100 బైకులు ర్యాలీతో పార్టీ ఆఫీస్ వరకు వెళ్లడం జరుగుతుంది, అలాగే 10000 మందికి భోజనాలు ఏర్పాటు చేయడం, పరదాలు వేయడం, నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా, గ్రామాల్లో నాయకులు కార్యకర్తలు ప్రతి ఒక్కరు వచ్చి మంత్రి గారి ప్రోగ్రాం విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కావాలి ఆంజనేయులు, ప్రచార కార్యకర్త యనమల విశ్వనాథ్, గంట వెంకటకృష్ణ, రౌతు శంకర్, సర్పంచ్ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## ప్రజాస్వామ్య పరిరక్షణ

## కోసం ఏకమవుదాం, - ప్ర, ప, ఐక్యవేదిక

జన సముద్రం న్యూస్,15సెప్టెంబర్,అనంతపురం.

ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రజలందరూ అవగాహనతో ఏకం కావాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు మంచాల. రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు . నేడు అంతర్జాతీయ ప్రజాస్వామ్య పరిరక్షణ దినోత్సవ సందర్భంగా ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక ఆధ్వర్యంలో స్థానిక పి వి కె కె డిగ్రీ కళాశాల నందు సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది . పై సభకు జిల్లా అధ్యక్షులు కే అల్తాఫ్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర అధ్యక్షులు మాంచాల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే కేవలం ఎన్నికలలో జరుగుతున్న ఫలితాల సరళనే ప్రజాస్వామ్యంగా ప్రజల భావిస్తున్నారని ,కానీ ప్రజల చేత ప్రజల కొరకు ఏర్పడి, ప్రజలు యజమానులుగా కొనసాగినప్పుడే నిజమైన ప్రజాస్వామంగా భావించవచ్చని అన్నారు ,అలా కాకుండా రాజ్యాంగం చట్టాలు బలహీనలతో పై రుద్దడానికి మాత్రమే పనికొస్తున్నాయని, బలవంతులు చట్టాల్ని తమ చేతిలోకి తీసుకొని పరిపాలన సాగిస్తున్నారని ,అలా కాకుండా రాజ్యాంగము చట్టాలు ప్రజల కోసమే పనిచేయాలని అప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమన్నారు .ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం సాంబశివుడు, జిల్లా నాయకులు టివి రెడ్డి, సుబ్బరాయుడు ,రమణారెడ్డి, డాక్టర్.అంకె రామలింగయ్య నగర కమిటీ నాయకులు కే ఓబులపతి ,రామకృష్ణ, మంజునాథ్ ,రూరల్ కమిటీ నాయకులు సంగా ఫణి భూషణ్ ,సూర్య ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.